

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విజయనగరం
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024



పేదలకు పట్టెడన్నం

● విజయనగరంలో ఐదేళ్ల తరువాత తెరచుకున్న అన్నక్యాంటీన్లు
● రెండుచోట్ల పునఃప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ ● ఇదో బృహత్తర కార్యక్రమమని వెల్లడి



భోజనం చేస్తున్న వృద్ధుడు

విజయనగరం రూరల్/రింగురోడ్డు, ఆగస్టు 16: పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లు ఐదేళ్ల తరువాత మళ్లీ తెరచుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం మూసేసిన ఈ క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను రాష్ట్ర సూక్ష్మ, చిన్న పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాలు, సెర్ప్‌శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. మంత్రితో పాటు కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు స్వయంగా ఆహారాన్ని పేదలకు వడ్డించారు. అలాగే, వారు కూడా తిన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించడం బృహత్తర కార్యక్రమమని తెలిపారు. వచ్చే నెలాఖరు నాటికి బొబ్బిలిలో ఒకటి, విజయనగరంలో మరొక అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. పేదరిక నిర్మూలనకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ.. అన్నం పెట్టే వారిని కూడా జగన్ రెడ్డి ప్రభుత్వం వదల్లేదన్నారు. వారిపై కూడా కేసులు నమోదు చేశారని అన్నారు. అన్ని సేవలు కన్నా, పేదలకు ఆహారం అందించడం ఎంతో మంచిదన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో కూడా గ్రీవెన్స్‌కు వచ్చే వారికి తక్కువ ధరకే భోజనం లభించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ఘోషాసుపత్రి వద్ద వచ్చే నెలఖరులోగా అన్న క్యాంటీన్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు, నడిపిల్లి రవికుమార్, కంది మురళీనాయుడు, గంటా రవి, ఎస్‌కేఎం భాష తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, కేంద్ర మాజీ మంత్రి అశోక్, ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

సంతృప్తిగా తిన్నారు..

విజయనగరంలో రెండుచోట్ల పునఃప్రారంభించిన అన్న క్యాంటీన్లలో పేదలు, కార్మికులు, మహిళలు తదితరులు సంతృప్తిగా తిన్నారు. ఉదయం అల్పాహారం కింద ఇడ్లీ, చట్నీ, పూరీ, కుర్మా, మధ్యాహ్నం అన్నం, పప్పు, పచ్చడి, కూర అందించారు. తొలి రోజు అన్న క్యాంటీన్ల ముందు భారీ స్థాయిలో ప్రజలు క్యూ కట్టారు. రూ.5 చెల్లించి టోకెన్లు తీసుకుని భోజనం చేశారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను తెలియజేశారు.



అన్న క్యాంటీన్ వద్ద బారులు తీరిన ప్రజలు



అప్పన్న, రిక్షా కార్మికుడు, రాకోడు గ్రామం



విజయనగరం మండలం రాకోడు గ్రామానికి చెందిన ఇతని పేరు ఎం.అప్పన్న. నగరంలోని మార్కెట్‌లో కాయగూరలను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి రిక్షాపై తరలించడంతో పాటు, గంటస్తంభం చుట్టు పక్కలా, సిటీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రిక్షా లాగుతూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతిరోజూ ఉదయాన్నే ఇంటి నుంచి బయలు దేరి క్యారీజు తీసుకుని వచ్చి మధ్యాహ్నం ఖాళీ సమయంలో భోజనం చేసేవాడు. శుక్రవారం నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో రూ.5చెల్లించి అప్పన్న మధ్యాహ్నం భోజనం చేశాడు. తిన్న తరువాత రిక్షా తొక్కేందుకు వెళ్లిపోయాడు. గతంలో కూడా తాను అన్న క్యాంటీన్‌లో మధ్యాహ్నం భోజనం చేసేవాడినని, గత ఐదేళ్లుగా దీనిని మూసేయడంతో ప్రతి రోజు ఇంటి నుంచి క్యారీ తెచ్చుకుంటున్నానని ఆయన తెలిపాడు. అన్న క్యాంటీన్ పునఃప్రారంభం కావడంతో ఇకనుంచి క్యారీ తెచ్చుకోకుండా, ఇక్కడే భోజనం చేస్తానని చెప్పాడు. ఈ సందర్భంగా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపాడు.

ఎంతో ఆనందంగా ఉంది..



గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఎత్తేయడంతో నాలాంటి వారు ఎందరో ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది. నెలకు ఆరేడు సార్లు వివిధ పనుల మీద విజయనగరం వస్తుంటాను. హోటల్‌లో భోజనం చేయాలంటే రూ.100 తక్కువ ఉండదు. ఇప్పుడు అన్న క్యాంటీన్‌లో ఐదు రూపాయలకే కడుపునిండా తిన్నాను. క్యాంటీన్లను నిర్విరామంగా కొనసాగించాలి.

-లక్ష్మణరావు, విభిన్న ప్రతిభావంతుడు, చీపురుపల్లి

ఎంతో మేలు...



అల్పాదాయం వచ్చే నాలాంటి వారికి అన్న క్యాంటీన్లతో ఎంతో మేలు కలుగుతుంది. ఉదయం రూ.5 చెల్లించి అల్పాహారం, మధ్యాహ్నం రూ.5 చెల్లించి భోజనం చేశాను. రాత్రికి ఇంటికి వెళతాను. ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా నాపై ఆర్థిక భారం తగ్గినట్టయింది. అన్న క్యాంటీన్లను వైసీపీ రద్దు చేయడం ఎంతో బాధ కలిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తెరిపించారు. -పి.సంతోష్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుడు, వృత్తిదారుడు

డబ్బు ఆదా అవుతుంది..



గంటస్తంభం వద్ద నేను వ్యాపారం చేస్తుంటా. ప్రతి రోజూ టిఫిన్ చేసేందుకు నా పింఛన్ డబ్బులు రూ.20 చెల్లించేదాన్ని. ప్రస్తుతం అన్న క్యాంటీన్‌లో రూ.5కే ఇడ్లీ తిన్నాను. భోజనం కూడా ఇక్కడే చేస్తాను. దీనివల్ల నాకు కొంత డబ్బు ఆదా అవుతుంది. గతంలో కూడా అన్న క్యాంటీన్‌లో తినేదాన్ని. కానీ, వైసీపీ దాన్ని తొలగించింది.

-ఎర్రంశెట్టి సీతమ్మ, పండ్ల వ్యాపారి

చంద్రబాబు బాగుండాలి..



అన్న క్యాంటీన్‌లో టిఫిన్, భోజనం చేసేందుకు పింఛన్ డబ్బును కొంత వినియోగిస్తా. మిగతా డబ్బులతో మందుల కొనుగోలు చేసుకుంటా. అన్న క్యాంటీన్‌లను గత ప్రభుత్వం ఎందుకు ఎత్తేసిందో? నాకు తెలియదు. చంద్రబాబు వచ్చి మళ్లీ వాటిని తెరిపించారు. చంద్రబాబును మేము మరచిపోలేం. ఆయన బాగుండాలి. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలి -పేర్ల పార్వతి, వృద్ధురాలు

ఆ భూములు ఎవరికి విక్రయించారు?

● అసైన్డ్, ఫ్రీహోల్డ్ భూ రికార్డులను పరిశీలించిన రెవెన్యూ ప్రధాన కార్యదర్శి సిసోడియా ● రిజిస్ట్రేషన్లపై ఆరా



మరాడపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రికార్డులు పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

భోగాపురం, ఆగస్టు 16: మండలంలోని పోలిపల్లి, బసవపాలెం రెవెన్యూ పరిధిల్లోని అసైన్డ్, ఫ్రీహోల్డ్ భూములపై రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆరా తీశారు. ఆ భూరికార్డులను పరిశీలించి వాటిని ఎవరికి విక్రయించారు, ఎప్పుడు అమ్మకాలు చేశారు తదితర అంశాలపై రైతులను అని అడిగి తెలుసుకున్నారు. ముందుగా పోలిపల్లి రెవవెన్యూలోని లింగాలవలస సమీపంలో ఉన్న మరాడపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి ఆయన చేరుకున్నారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాదవన్, ఆర్డీవో ఎం.వి.సూర్యకళ ఆయనకు స్వాగతం పలికారు. పోలిపల్లి రెవన్యూలో సుమారు 208 మంది రైతుల వద్ద 378.62 ఎకరాల డిపట్టా భూములు ఉన్నాయి. ఇందులో 23 మంది రైతులకు చెందిన 20.65 ఎకరాల డిపట్టా భూములను ఫ్రీహోల్డు చేశారు. వీరిలో ఏడుగురు రైతులు సుమారు 16 ఎకరాలు అమ్మకాలు చేశారు. దీంతో డీపట్టా, ఫ్రీహోల్డ్ చేసిన భూములకు సంబంధించి ఎఫ్ఎంబీ, ఎఫ్‌సీవో, అడంగళ్లు, డీఆర్ ఫైళ్లు, ఆన్ గ్రౌండ్ పొజిషన్, మ్యాప్ తదితర అన్ని రికార్డులను రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా పరిశీలించారు. వీటిపై వీఆర్వోలు, అధికారులతో చర్చించారు. భూములు ఎప్పుడు అమ్మకాలు చేశారు, ఎవరికి విక్రయించారు తదితర అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగాపురం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అక్కడ అన్ని భూరికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ నుంచి భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి భూ రిజిస్ట్రేషన్ల రికార్డులు పరిశీలించారు. సబ్‌రిజిస్ట్రార్ రోహన్‌కుమార్‌తో పలు విషయాలపై మాట్లాడారు. అదేవిధంగా బసవపాలెం రెవెన్యూలో సుమారు 75 ఎకరాలు డిపట్టా భూములు ఉండగా అక్కడ సుమారు 26 ఎకరాలు ఫ్రీహోల్డు చేశారు. అక్కడకు వెళ్లి రైతులతో మాట్లాడి భూములు మీ వద్దనే ఉన్నాయా, మీరే సాగు చేసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ వి.విజయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారి, తహసీల్దార్ ఎం.సురేష్, ఉపతహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, రైతులు ఉన్నారు.

కొండగంగుబూడిలో బయటపడిన అవకతవకలు

శృంగవరపుకోట: వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామ పరిధిలోని ఫ్రీహోల్డ్ (చట్టబద్ధత) అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగినట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ప్రాథమికంగా గుర్తించారు. శృంగవరపుకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. కొండగంగుబూడి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కంప్యూటర్‌లో నమోదైన వివరాలకు, వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. కొండగంగుబూడిలో 450.39 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇందులో ఫ్రీహోల్డ్ చేసేందుకు 384.64 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు తహసీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారుల లాగిన్లలోకి వచ్చాయి. వీటిలో 224.95 ఎకరాలే వెబ్‌ల్యాండ్‌లో కనిపించాయి. వీటిని పరిశీలించిన స్థానిక రెవెన్యూ అధికారులు గెడ్డలు, చెరువులు, కాలువలు వంటివి ఉన్న భూములను తప్పించి మిగతా 210.11 ఎకరాల అసైన్డ్ భూములకు చట్టబద్ధత కల్పించారు. ఈ భూముల్లో 98.32 ఎకరాలు చేతులు మారాయి. శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. ఈ భూమి కంటే అదనంగా మరో నాలుగు ఎకరాల పైబడి రిజిస్ట్రేషన్ జరిగినట్లు రికార్డుల బట్టి తెలుస్తోంది. పేదలకు డబ్బు ఆశ చూపి ఈ భూములను పెద్దలు కొనేశారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల చెల్లించినట్లు తెలుస్తోంది. కానీ, ఇంతకు పది రెట్లు సొమ్ము ఇచ్చినట్లు పత్రాలపై పేదల సంతకాలు తీసుకున్నారు. ఇవికాక 30 నుంచి 90 సంవత్సరాలకు లీజు అగ్రిమెంట్లు చేసుకున్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల సహకారంతో ఈ భూములకు ప్రణాళిక బద్ధంగా చట్టబద్ధత జరిగేట్లు చూసుకున్నారు. మొదట్లో ఈ భూములకు రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు సంబంధిత అధికారులు నిరాకరించారు. తరువాత ఏమైందో గానీ పచ్చజెండా ఊపేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేన్లను ఆపేసి రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాతో విచారణ చేయిస్తుంది. దీంతో అసైన్డ్ భూములను కాజేసిన వారిలో వణుకు పుడుతుంది.



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు



చీపురుపల్లి: గాజుల అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



పుష్పాలు, కరెన్సీ నోట్లతో కన్యకాపరమేశ్వరిని అలంకరించిన దృశ్యం

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

● కిటకిటలాడిన ఆలయాలు ● ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 16: జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ నమోస్తుతే.. అంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, రామభద్రాపురం, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురుపల్లి, ఎస్.కోట, జామి తదితర ప్రాంతాల్లో వరలక్ష్మీ వ్రతాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొంతమంది బంగారం, వెండి వస్తువులను పూజలో ఉంచారు.. అనంతరం వాటిని ధరించారు. విజయనగరం పైడిమాంబ ఆలయంలో హోమంతో పాటు, వరలక్ష్మీ పూజ నిర్వహించారు. గాజులతో అమ్మవారిని అలంకరించారు. నగరంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పూలు, కరెన్సీ నోట్లతో అలంకరించారు. అదే విధంగా సంతోషిమాతకు కూడా పుష్పలంకరణ చేశారు. చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని గాజులతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

● జూనియర్ వైద్యులకు రక్షణ కల్పించాలి
● విజయనగరం, నెల్లిమర్లలో జూడాల నిరసన



నెల్లిమర్లలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న మిమ్స్ వైద్య విద్యార్థులు

విజయనగరం దాసన్నపేట/ విజయనగరం రూరల్/ నెల్లిమర్ల, ఆగస్టు 16: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థిని హత్యాచారానికి గురవడంపై జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు శుక్రవారం నిరసన తెలియజేశారు. జిల్లా కేంద్రాసుపత్రి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా నేటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. అదే విధంగా శుక్రవారం రాత్రి నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య విద్యార్థులు

నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు బంద్..

వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం జిల్లాలోని 223 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ప్రాణాలు రక్షించే వారికే నేడు సమాజంలో రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీ అశోకన్ పిలుపు మేరకు రాష్ట్రం, జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేయనున్నట్టు ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప ఆసుపత్రులకు రావద్దని ప్రజలకు సూచించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం ● 17 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలుపెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యామీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్' , కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గులెహర్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తాజాగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపిక య్యారు. 2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషబ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్' రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.







తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?



జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగియి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మద్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షూ 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతారామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

ఉత్తమ చిత్రం: 'ఆట్టమ్ (మలయాళం)
ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార- కన్నడం)
ఉత్తమ నటి: నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)
ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)
హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్: కాంతార (కన్నడ)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్: బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ
ఉత్తమ నూతన దర్శకుడు: ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వి)
ఉత్తమ సహాయ నటి: నీనా గుప్తా (ఉంఛా- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)
ఉత్తమ బాలనటుడు: శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)
ఉత్తమ ఛాయాగ్రాహకుడు: రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: ఆనంద్ ఏకార్షి(ఆట్టమ్)
ఉత్తమ సంభాషణల రచయితలు: అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)
ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం): ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)
ఉత్తమ గీత రచయిత: నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)
ఉత్తమ నేపథ్య గాయకుడు: అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)
ఉత్తమ గాయని: బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)
ఉత్తమ ప్రాంతీయ చిత్రం: (కార్తికేయ 2 - తెలుగు)
ప్రత్యేక ప్రశంస: నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)
ఉత్తమ ఎడిటర్: మహేశ్ భువనేంద్ (ఆట్టమ్)
ఉత్తమ యాక్షన్ డైరెక్టర్: అన్బరివు (కేజీఎఫ్ 2'
బెస్ట్ బుక్ ఆన్ సినిమా: కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
బెస్ట్ క్రిటిక్: దీపక్ దుహా (హిందీ)

భూముల రికార్డుల భద్రతకు చర్యలు

● రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



సమావేశంలో మాట్లాడుతున్న సిసోడియా

కలెక్టరేట్: భూముల రికార్డులను పరిశీలించడానికి, రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి రోజుకో జిల్లా చొప్పున పర్యటిస్తున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. భోగాపురం మండలం పోలిపల్లి, బసవ పాలెం గ్రామాలను సందర్శించామని, ఎఫ్‌సీవో, పాత అడంగల్, 22ఏ జాబితాలను పరిశీలించామని చెప్పారు. కొన్ని రికార్డుల్లో భూ ముల వర్గీకరణలో గుర్తించిన తేడాలను సరిచేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని సుమారు 5,700 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారని, దానిలో 191 ఎకరాల వరకూ రిజిస్ట్రేషను పూర్తయ్యాయని తెలిపారు. నిబంధనలు ప్రకారం ఫ్రీహోల్డ్ జరిగిందా? లేదా? రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగాయా? లేదా అనే విషయాన్ని పరిశీలించామని తెలిపారు.

ఇళ్ల పథకం భూములపై ఆరా..

జిల్లాలోని పేదలందరికీ ఇళ్ల పథకంలో కేటాయించిన భూముల వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆయన చెప్పారు. ఈ పథకం కింద ఎంత భూమి కేటాయించారు? అందులో ప్రభుత్వ భూమి ఎంత? డి.పట్టా భూమి ఎంత? ఎంత కొనుగోలు చేశారు? పరిహారం ఎంత చెల్లించారు? ఇళ్ల కోసం కేటాయించగా... ఇంకా ఎంత మిగిలింది? లబ్ధిదారుల అర్హత వివరాలతో రెవెన్యూ సదస్సుల్లో సమర్పించాలని సూచించారు. గత ఐదేళ్లలో 22ఏ కింద నోటిపై చేసిన భూముల వివరాలను, మ్యుటేషన్ సేవలను మండలాల వారీగా పరిశీలించారు. 20 ఏళ్ల క్రితం వరకూ ఫ్రీ హోల్డ్‌లో ఉన్న భూములను వెరిఫికేషన్ చేయవలసి ఉందన్నారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులు, తహసీల్దార్ రికార్డులలో ఉన్న వివరాలు ఒకేలా ఉండాలని చెప్పారు.

భద్రతపై దృష్టి

జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్న భూ రికార్డులకు ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యాలయాలకు అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయంలో వాచ్‌మెన్‌ను నియమించాలని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.

సిసోడియాను కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైం: రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను ఎస్పీ వకుల్ జిందాల్ జడ్పీ అతిథి గృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులు, భూ ఆక్రమణలు తదితర వాటిపై ఇరువురూ చర్చించారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి..

కలెక్టరేట్: క్షేత్ర స్థాయిలో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకూ పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీ సర్వే వల్ల కొత్త సమస్యలు వచ్చాయి తప్ప పరిష్కారం కాలేదు. రెవెన్యూ రికార్డుల్లో అనేక చోట్ల పేర్లు మారిపోయాయి. దీని వల్ల ఇబ్బంది పడుతున్నాం. ఈ అక్రమాలపై చర్యలు తీసుకుని లోపాలను సరిదిద్దాలంటూ వివిధ గ్రామాల రైతులు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు మొర పెట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో భూ సమస్యలపై రైతులు వినతులు సమర్పించారు. వివిధ సమస్యలపై 80 వినతులు వచ్చాయి. నేరుగా వినతులు స్వీకరించిన ప్రత్యేక కార్యదర్శి సిసోడియా పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అందించారు.

చెరువు గర్భం రిజిస్ట్రేషన్..

'డెంకాడ మండలం గుణుపూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 60-3లో ఆనందరాజు చెరువు 22.24 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు కింద 30 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు గర్భాన్ని ఈ ఏడాది మే 24, 25 తేదీల్లో కొందరు వ్యక్తులు బినామీ పేర్లతో సుమారు 15 ఎకరాల మేరకు భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రైతుల ఆందోళనతో రిజిస్ట్రేషన్లు రద్దు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ ప్రకటించారు. అయినా బినామీ పేర్లతో ఇంకా 1 బిలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదు. మరోవైపు అనందరాజు చెరువు కింద సాగు చేస్తున్న అర్హులైన రైతులకు 1బిలు ఉన్నాయి. కానీ అర్హుల పేర్లు తొలగించి.. అనధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పేర్లు నమోదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని నిజమైన రైతులకు న్యాయం చేయాల'ని దామోదరరావు, కామేష్‌రావు, ఈశ్వరరావు సిసోడియాను కోరారు.

ఆ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

'జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వీఆర్‌వో, సర్వేయర్ ఆదే గ్రామంలో ఉండేలా చూడాలి. తహశీల్దార్ కార్యాలయంలో మ్యుటేషన్ కోసం వెళ్తున్న చిన్న, సన్న కారు రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడంతో మ్యుటేషన్ దరఖాస్తులను తిరస్కరణకు గురవుతున్నాయి. వీటిని సరి చేసి రైతులకు న్యాయం చేయాల'ని ఏపీ రైతు సంఘ నాయకులు రాంబాబు, ఆదినారాయణలు రెవెన్యూ కార్యదర్శికి విన్నవించారు.

లేఅవుట్ ప్లాట్లకు 1బీ ఇచ్చారు..

'విజయనగరం పట్టణంలోని ధర్మపురి రెవెన్యూ పరిధిలో 1982లో రైల్వే కోఆపరేటివ్ సొసైటీ పేరిట 4 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. అందులో వేసిన ప్లాట్లను అప్పట్లో చాలా మంది ఉద్యోగులు కొనుగోలు చేసుకున్నారు. 2022లో ఓ ప్రజా ప్రతినిధి పేరున అప్పటి రెవెన్యూ అధికారులు 1బి ఇచ్చారు. పురపాలక శాఖకు పన్ను చెల్లిస్తుండగా 1బి ఎలా మంజూరు చేశారో తెలియడం లేదు. కోర్టులో కేసు ఉంటుండగా 1 బి మంజూరు చేయడం సరికాదు. దీనిపై విచారణ చేపట్టి.. న్యాయం చేయాల'ని ప్లాటు కొనుగోలుదారుడు మోహనరావు ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

దత్తిరాజేరు: గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతిచెందారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున బలిరెడ్డి సురేష్ (26) పెదమానాపురం వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిది పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు. తన నాయనమ్మ స్వగ్రామమైన పెదమానాపురం వచ్చినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి... కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

బాడంగి: రామచంద్రాపురం వాటర్ ట్యాంకు వద్ద శుక్రవారం స్కూటీ, బైకు ఢీకొన్న సంఘటనలో కోడూరు గ్రామానికి చెందిన రౌతు సత్యనారాయణ, పాములవలసకు చెందిన సునీల్ గాయపడ్డారు. సత్యనారాయణ కోడూరు నుంచి మల్లంపేట వెళుతున్నారు. తెర్లాం మండలం పాములవలస గ్రామానికి చెందిన కొన్న సునీల్ మోటారు సైకిల్‌పై వస్తున్నారు. రామచంద్రపురం వాటర్ ట్యాంకు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో సత్యనారాయణకు కుడి చెయ్యి, వెన్నెముక దెబ్బతినడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. సునీల్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

ఉచిత వైద్యశిబిరాలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. గొల్లపల్లి గ్రామస్తులు నిర్వహించిన శిబిరంలో బేబీనాయనతో పాటు, జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య, మెగా రక్తదాన శిబిరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సంఘ అధ్యక్షుడు మోహనరావు, చిరంజీవిరావు, రెడ్డి నతానియేలు, గంపరాయి తిమోతిరాజు, శామ్యూల్, డేవిడ్ రాజు, ధనంజయనాయుడు, బీపీఎఫ్ఏ చైర్మన్ కొల్లా అదృష్టకుమార్, పాకా సురేన్‌బాబు పాల్గొన్నారు.

మురుగు సమస్య లేకుండా చూడండి



మురుగు కాలువను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: విజయనగరంలోని గంట స్తంభం ప్రాంతంలో పాలిథిన్, ఇతర వ్యర్థాలతో నిండి ఉన్న కాలువను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు శుక్రవారం పరిశీలించారు. ఈ కాలువ పరిస్థితిని మెరుగుపరచాలని, తక్షణమే వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ ఎంఎం నాయుడును ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మురుగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.

మరువలేని నాయకుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప మహనీయుడని, దేశం మరువలేని నాయకుడని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాలకృష్ణ, సీతారాం, జగ్గారావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సలహా కమిటీ సమావేశం



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట: కొత్తవలస, ఎస్.కోట మండలాల బీసీ సంక్షేమ హాస్టళ్ల సలహా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించి హాస్టళ్ల నిర్వహణ, సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లతో పాటు డీటీ రమేష్, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, కె.రాముడు, జి.ప్రసాద్, భూపాల్ నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: ఎరకందొరవలసలో శుక్రవారం వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గిరిజన పేద మహిళలు, బాలలు, వృద్ధులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణదాస్, వీఎస్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి నిరోధంపై ప్రత్యేక దృష్టి

● ఎస్పీ వకుల్ జిందాల్



గంజాయితో దొరికిన నిందితులతో ఎస్పీ వకుల్ జిందాల్, సిబ్బంది

విజయనగరం క్రైం: గంజాయి అక్రమ రవాణా, నిరోధంపై ప్రత్యేక దృష్టి పెడతామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామం వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఒక వ్యక్తి నుంచి మోటారు సైకిల్, గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. ఆ వివరాలను ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనం సీటులో స్పాంజ్‌కు బదులుగా గంజాయిని కుక్కి ఒడిశాలోని సుంకి నుంచి రాయగడకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా అంపనీ పోలీసు స్టేషన్ పరిధిలోని హరిప్రసాద్ హంసా అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 20 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మల్కనగిరి జిల్లా గురసేతు గ్రామానికి చెందిన జిను పంగీ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నారని, పతి సిగోల్ అనే వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించినట్టు గుర్తించామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. త్వరలో వారిని అరెస్టు చేస్తామని చెప్పారు.

బొబ్బిలి పట్టణ పరిధిలో..

బొబ్బిలి పట్టణ పరిధిలోని శ్మశాన వాటిక మైదానంలో బొబ్బిలి సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లాకు చెందిన నాగాలాపురం లోహిత్, అలియాస్ లోహిత్ భరత్ నుంచి ఆరు కిలోలు, బొబ్బిలి పట్టణానికి చెందిన చింతాడ సారథి అలియాస్ నాని నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొబ్బిలికి చెందిన శిమిడి ప్రేమ్ కుమార్, లంక నిఖిల్, దేవుపల్లి చందన్‌అలియాస్ బంజు గంజాయి వ్యాపారంలో సహాయ పడినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వీరితో పాటు ముగ్గురు జువెనైల్స్ కూడా అక్రమంగా గంజాయిని తరలించడంలో సహకరించడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. లోహిత్, భరత్‌పై ఇప్పటికే పార్వతీపురం పట్టణంలో గంజాయి కేసు నమోదైందని తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐలు విజయనాథ్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారుడి అరెస్టు..

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రహదారిలో వ్యక్తిని అదుపులోకి తీసుకుని నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. రైల్వే స్టేషన్ రహదారిలో ఎస్ఐ నవీన్‌పడాల్, ఎస్‌బీ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా, ఒడిశా రాష్ట్రం సబల్‌పూర్ జిల్లాలోని బిక్సిరా గ్రామానికి చెందిన గోవర్ధన్ పటేల్ వద్ద గంజాయి దొరికింది. అదే ప్రాంతానికి చెందిన మనోజ్ వ్యక్తి ద్వారా విజయనగరం వచ్చారని తెలిపారు. గోవర్ధన్ పటేల్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.



రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు తదితరులు

గ్రామ పంచాయతీల బలోపేతానికి సహకరించాలి

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతి

రాజాం రూరల్: గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, రాజాం మండలం ఒమ్మి సర్పంచి వంగా వెంకటరావు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొన్న ఆయన శుక్రవారం జిల్లాలోని సర్పంచులతో కలిసి రామ్మోహన్‌నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆదినారాయణ, సుందరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి సన్మానం



శతాధిక వృద్ధుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు

బొబ్బిలి రూరల్: పారాది గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు అల్లాడ తమ్మినాయుడు (109)ను స్థానికులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ తమ్మినాయుడు తన యుక్త వయసు నుంచి ఆధ్యాత్మిక కుసుమాలను గ్రామంలో వికసింపజేసేందుకు ఎంతో పరితపించేవారని కొనియాడారు. శతాధిక వృద్ధుడిని తమ గ్రామానికి సొత్తుగా భావిస్తున్నామని తెలిపారు. తమ్మినాయుడు మాట్లాడుతూ తనకు భార్యాపిల్లలు లేరని... లక్ష్మి అనే అమ్మాయిని పెంచి పెద్ద చేసి పెళ్లి చేశానని చెప్పారు. తన పోషణ భారం ఆమె చూస్తోందని వివరించారు.

ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసం



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న విద్యుత్ మోటార్లను చూస్తున్న రైతు

వంగర: వీవీఆర్‌పేట, రాజులగుమ్మడలో తిష్టవేసిన ఏనుగుల గుంపు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే రెండు గ్రామాల్లో 15 ఎకరాల్లో వరి, అరటి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. శుక్రవారం రాజులగుమ్మడలోని వెంకటనాయడు, సత్యనారాయణలకు చెందిన పామాయిల్ తోటను, విద్యుత్ మోటార్లు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి.

జూట్ మిల్లును తెరిపించండి

కొత్తవలస: సీతంపేటలోనున్న జూట్‌మిల్ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా శుక్రవారం డిమాండ్ చేశారు. లాకౌట్ కారణంగా 400 మంది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. కార్మికుల జీతాలలో నుంచి కోసిన ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాన్ని సైతం ప్రభుత్వం వద్ద యాజమాన్యం జమ చేయలేదన్నారు. అధికారులు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం స్పందిచడం లేదన్నారు. తక్షణమే మిల్లును తెరిపించాలని కోరారు.

వయనాడ్ బాధితులకు విరాళం

బొబ్బిలి రూరల్: కేరళ వయనాడ్ బాధితుల కోసం వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం రూ.20 వేల చెక్కును కమిషనర్ రామలక్ష్మి సమక్షంలో రేవళ్ల కిరణ్ కుమార్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు, ట్రెజరర్ వీఎస్ శర్మ, ఎస్ఆర్ మోహనరావు, పి.సురేష్ బాబు, ఎ.గోవిందనాయుడు పాల్గొన్నారు.

కషాయంతో చీడపీడల నివారణ

బొబ్బిలి రూరల్: కషాయంతో పంటల్లో చీడపీడలను నివారించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్యాంసుందర్ తెలిపారు. పారాది గ్రామంలో శుక్రవారం రైతులకు వేపగింజల కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య ప్రతినిధి శంకరరావు, రైతులు పాల్గొన్నారు.

స్టీల్ క్యారేజ్‌ల వితరణ

బొబ్బిలి రూరల్: కోమటిపల్లిలో బొంతలకోటి శంకరరావు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో గత 308 రోజులుగా వృద్ధులకు, వికలాంగులకు ఇళ్లకు వెళ్లి ఆహారం అందిస్తున్నారు. వారికి ఆహారాన్ని పంపిణీ చేయడానికి హైదరాబాద్‌కు చెందిన సహాయ టీమ్ వారు 50 స్టీల్ క్యారేజులు ఉచితంగా అందించారని శంకరరావు శుక్రవారం తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా 33 కేవీ కలవరాయి, బలిజిపేట, అరోరా, సిరి స్మెల్లర్స్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఆవాల అనంతరావు తెలిపారు. బలిజిపేట, పినపెంకి, వంతరాం, నెమలాం, జగన్నాథపురం, కలవరాయి, పెంట, పిరిడి సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్.కోట విద్యార్థులు

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బర్నికాన హారిక, పంపాన మౌనిక రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రెడ్డి శివకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రిన్సిపాల్ కేశవరావు, ఆధ్యాపకులు ఆ విద్యార్థులను అభినందించారు.

జీఆర్‌పీ ఎస్ఐగా బాలాజీరావు

విజయనగరం క్రైం: విజయనగరం రైల్వే ఎస్ఐగా వి.బాలాజీరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ జీఆర్‌పీ స్టేషన్ నుంచి బదిలీపై విజయనగరం స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన బాలాజీ రావును జీఆర్‌పీ సిబ్బంది అభినందించారు.

మాజీ మంత్రి వాసిరెడ్డి జయంతి

బొబ్బిలి: దివంగత మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే సెంటరులో గల ఆయన విగ్రహానికి కొప్పులవెలమ సేవా సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ సంఘం నేత కర్రి సత్యనారాయణ, గొట్టాపు కృష్ణమూర్తి, వాసిరెడ్డి తనయుడు జగదీశ్ (తాతాజీ), రెడ్డి కృష్ణమూర్తి, కేతిరెడ్డి కృష్ణమూర్తి, బలగ సాయికృష్ణ, తిరుపతిరావు, వాలేటి తవిటినాయుడు, కొల్లి రామారావు, రెడ్డి దామోదరరావు, కుదమాల శివకుమార్, చౌదరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వాసిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సీఎంను కలిసిన ఎంపీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు.



సీఎం చంద్రబాబుకు పీవీజీ రాజు పుస్తకాన్ని అందజేసిన ఎంపీ కలిశెట్టి

డబ్బుల కోసమే హత్య

- వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఎదురింటి మహిళే నిందితురాలు
- 14 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

విజయనగరం క్రైం, ఆగస్టు 16: డబ్బుల కోసం ఓ వృద్ధురాలిని తన ఎదురింటి మహిళ హత్య చేసింది. అనంతరం వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పరారైంది. ఈ కేసును పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. నిందితురాలను అరెస్టు చేసి 14.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ విలేకరులకు వెల్లడించారు. బాడంగి పోలీసు స్టేషన్ పరిధిలోని బాడంగి ముగడ కాలనీలో గెద్ద కృష్ణవేణి (62) అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె భర్త నారాయణ ప్పలనాయుడు ప్రధాన ఉపాధ్యాయుడిగా పనిచేసి 2018లో మృతి చెందారు. అప్పటి నుంచి ఆ కాలనీలోనే కృష్ణవేణి ఒంటరిగా ఉంటుంది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు హరికృష్ణబాబు వృత్తిరీత్యా కుటుంబంతో విశాఖపట్నంలో, చిన్న కుమారుడు నాగేంద్రకుమార్ కుటుంబంతో పాలకొండలో నివాసం ఉంటున్నారు. కుమారులు అప్పుడప్పుడు తల్లి వద్దకు వచ్చి అవసరమైన మందులు కొనిచ్చి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న కృష్ణవేణి ఇంటి నుంచి గ్యాస్ వాసన వస్తుండడంతో స్థానికులు వెళ్లి తలుపులు తెరచి చూశారు. ఇంట్లో కృష్ణవేణి చనిపోయి ఉంది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకుపోయినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన తెంటు లక్ష్మి.. కృష్ణవేణి చిన్న కుమారుడు నాగేంద్రకుమార్‌కు ఫోన్ చేసి చెప్పింది. ఆయన ముగడ కాలనీకి చేరుకుని బాడంగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా కృష్ణవేణి ఇంటి ఎదురుగా గత కొంతకాలంగా నివాసం ఉంటున్న బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన కలిశెట్టి లలితకుమారి అనే మహిళ 20 రోజుల కిందటే ఇంటిని ఖాళీ చేసి విశాఖపట్నం కంచెరపాలెంనకు వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ నాగేశ్వరరావు, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, సిబ్బంది బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఆమెను బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరాన్ని అంగీకరించింది. తనకు డబ్బులు అవసరమై పక్కా ప్లాన్ ప్రకారం ఈ నెల 11న కృష్ణవేణి ఇంటికి వచ్చినట్లు లలితకుమారి చెప్పింది. చున్నీతో కృష్ణవేణి గొంతు బిగించి హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పరారైనట్లు తెలిపింది. ఆమెను అరెస్టు చేసి 14.5 బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు జయంతి, భాగ్యం, ఏఎస్ఐలు కొండలరావు, గౌరీశంకర్, హెచ్‌సీ సన్యాసిరావు, రామకృష్ణారావు, శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు హిమశంకర్, విశాలమ్మలను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్బీ సీఐలు విజయనాథ్, నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు.. ప్రయాణికుల పాట్లు



రాత్రివేళ రోడ్డుపై తిరుగుతున్న పశువులు

రాజాం: పట్టణంలోని ప్రధాన రోడ్లపై పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పెంపకందారులు వాటిని రోడ్డుపై వదిలేయడంతో మనుషులపై దాడి చేస్తున్నాయి. ఇటీవల కొండంపేట గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళపై పాత ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పశువులు దాడి చేసి గాయపరిచాయి. సంబంధిత యజమానులు సమయానికి పాలు తీసుకొని రోడ్డుపై వదిలి పెడుతున్నారు. ప్రధాన రహదారులపై తిరుగుతుండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకొని పశువులను రోడ్లపైకి రాకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు

జలమయమైన బొబ్బిలి రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న జనం



జలమయమైన బొబ్బిలి మెయిన్ రోడ్డు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ పరిధిలో శుక్రవారం కురిసిన వర్షానికి అనేక రోడ్లు జలమయమయ్యాయి. 8వ వార్డులో పాడైన రోడ్డుకు గత రెండు రోజుల నుంచి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. భారీ వర్షం కారణంగా ఆ పనులకు నష్టం జరిగింది. మురుగునీరు, వర్షపునీరు పెద్దఎత్తున ఈ రోడ్డు పనులపై ప్రవహించింది. కాలువల్లో నుంచి గాజు సీసాలు, చెత్తాచెదారం పెద్దఎత్తున రోడ్లపై పేరుకుపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నాయుడుకాలనీలో వరదనీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇందిరమ్మకాలనీకి ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి వెళ్లేందుకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రోడ్ల దుస్థితిపై ఏకిపారేసిన కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు వారు అధికారం లోనికి వచ్చిన తరువాత కూడా ఏమాత్రం మార్పులేకుండా పోయిందని పీసీసీ సభ్యుడు ముద్వల శ్రీనివాసరావు విమర్శించారు.

24 గంటలు వైద్య సేవలు నిలిపివేత

- కోల్‌కత్తా ఘటనపై నిరసన



మాట్లాడుతున్న ఐఎంఏ ప్రతినిధులు

రింగురోడ్డు: కోల్‌కత్తాలోని ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఈనెల 9న వైద్యురాలిపై అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రతినిధులు మాట్లాడారు. వైద్య కళాశాల విద్యార్థులపై ఈనెల 14న రౌడీ మూకలు దాడి చేసిన సంఘటనను నిరసిస్తూ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకూ నగరంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐతో నేర పరిశోధన చేసి నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్లు అశోక్, శ్రీనివాస్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే మహిళలు అధిక సంఖ్యలో ఆలయాల వద్ద బారులు తీరారు. అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సామూహిక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే గృహాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు



ఎస్.కోట: పుష్పాలంకరణలో శ్రీదేవీ మాత



రామభద్రపురం: అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



విజయనగరం: ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు




జామి: కలువ పూలతో శ్రీకనకదుర్గమ్మ



బొబ్బిలి: వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికి వాయనం అందిస్తున్న భక్తులు



బొబ్బిలి: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు



కొత్తవలస: దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేకాలంకరణలో వరలక్ష్మీదేవి



రాజాం రూరల్: మహాలక్ష్మీదేవి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రసవాలను రిఫర్ చేస్తే ఉపేక్షించేది లేదు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: సాధారణ ప్రసవాలు ఆసుపత్రిలోనే జరగాలని, ఇక్కడి నుంచి రిఫర్ చేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అన్ని వార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన వైద్యులు ప్రసవాలను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ముగ్గురు గైనకాలిస్టులు ఉన్నా ఎందుకు ఇలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. ఇందుకు వైద్యులు.. ప్రసవాలు ఇక్కడే జరుగుతున్నాయని చెప్పడంతో సమాచారం తెప్పించుకుంటానని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మార్చురీ గది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అలాగే డ్రైనేజీ, జనరేటర్, సమస్యలు ఉన్నాయని సూపరింటెండెంట్ జగదీష్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వంద పడకల ఆసుపత్రికి సంబంధించి పనులు నిలిచిపోవడంతో 30 పడకల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రూ.కోటి 20లక్షలతో ప్రతిపాదనలు చేశామని, త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నిరుపేదలకు ఇబ్బందులకు కలగకుండా కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకు ఎవరు నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, ప్రదీప్‌కుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

యువత పరిశోధనల వైపు దృష్టి సారించాలి

నెల్లిమర్ల: యువత పరిశోధనల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయంలో ఐవోటీ ద్వారా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ కుట్టు యంత్రాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తక్కువ ఎత్తులో ఎగిరే జైరోప్లేన్, ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిచే ఇ-ఆటోలు, సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల ఆహార పదార్థాలు, విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు, 3డీ యంత్రం, ఆగ్మెంటెడర్ రియాల్టీ, వర్చువల్ రియాల్టీ తదితర వాటిని పరిశీలించారు విశ్వవిద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అమరావతిలో ప్రభుత్వం నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నదని, దీనికి అనుబంధంగా రాష్ట్రంలో పది చోట్ల నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి, డీన్‌లు పీఎస్వీ రమణరావు, సన్నిదయాళ్, ఎంఎల్ఎన్ ఆచార్యులు, మురళి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, ఎన్‌సీసీ అధికారి డా.సతీష్, యాజమాన్య ప్రతినిధి రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారికి మోక్షమెప్పుడో?

గజపతినగరం: గజపతినగరం మండలం నుంచి దత్తిరాజేరు మండలం పోరలి జంక్షన్ వరకు నిర్మాణం చేపడుతున్న బైపాస్ రహదారి పనులు నత్తనడక నడవడంతో రెండు మండలాల ప్రజలు రహదారికి మోక్షమెప్పుడు కలుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గజపతినగరం నుంచి జిన్నాం, గడసాం, పోరలి గ్రామం వరకు రెండేళ్ల కిందట 19 కోట్ల రూపాయలతో పనులు చేపట్టారు. అయితే నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో రెండు మండలాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. సుమారు 16 కిలో మీటర్లు రహదారి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వేసవిలో దుమ్ము ధూళి, వర్షాకాలం వచ్చిందంటే బురదమయమైపోతుందని దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.



గజపతినగరంలో అసంపూర్తిగా నిలిచిన బైపాస్ రోడ్డు పనులు

క్లుప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: చీపురుపల్లిలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో రణస్థలం ఫీడర్ మరమ్మతుల కారణంగా పుర్రేయవలస, గచ్చలవలస, వీకే పాలవలస విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ డీఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. **రేగిడి:** ఉంగరాడమెట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ బూరాడ ఫీడర్ లైన్ నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఎల్. హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లచ్చరాయపురం, నాయిరాలవలస, జాడపేట, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, కాగితాపల్లి, పారంపేట, పనసలవలస, ఉణుకూరు, అంబాడ, వెంకటాపురం, ఒప్పంగి, తునివాడ, చెలిగానవలస, రెడ్డిపేట, డోలపేట, వెంకమ్మపేట, రంగరాయపురం, కొర్లవలస, బూరాడ, పోరాం తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కాలి నడకన తిరుమలకు



తిరుమలకు నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

భోగాపురం: తిరుమల తిరుపతి దేవస్థానానికి కాలినడకన వెళ్తున్న పలువురు గోవింద స్వాములు శుక్రవారం భోగాపురం జాతీయరహదారి మీదుగా వెళ్లారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్.వెంకటరావు, విజ్జి మరియాబాబు, ఆళ్ల శంకర్రావు, సిరిపురపు పాపారావు ఇటీవల గోవింద మాల ధరించారు. వారు ఈనెల 15న శ్రీకాకుళంలో తిరుమలకు కాలినడకన బయలుదేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి తిరుమల కొండకు సుమారు 870 కిలోమీటర్లు ఉంటుందని, దేవునిపై నమ్మకంతో భక్తితో నడక ప్రారంభించామని, సుమారు 22వ తేదీకి నాటికి తిరుమలకు చేరుకుంటామని చెప్పారు.

సిసోడియా దృష్టికి భూ సమస్యలు

భోగాపురం: మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీలోగల మరాడపాలెం గ్రామానికి వచ్చిన రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ కలిసి, భూ సమస్యలపై వివరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ తనకు చెందిన పోలిపల్లి రెవెన్యూలో ఉన్న ఆరు ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు 22ఏలో పెట్టారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే మండలంలోని ఇతర భూ సమస్యలను బంగార్రాజు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.



సిసోడియాకు సమస్యలు వివరిస్తున్న కర్రోతు

డెంకాడ ఎస్ఐగా సన్యాసినాయుడు

డెంకాడ: డెంకాడ ఎస్ఐగా ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు పూసపాటిరేగ మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై డెంకాడ ఎస్ఐగా వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.



ఘనంగా ఏపీజీఈఏ వార్షికోత్సవం



పతాకానికి సెల్యూట్ చేస్తున్న ఉద్యోగుల సంఘ నాయకులు

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) వార్షికోత్సవాన్ని శుక్రవారం నెల్లిమర్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ట్రెజరీ కార్యాలయం ఆవరణలో అసోసియేషన్ పతాకాన్ని సంఘం నెల్లిమర్ల తాలూకాశాఖ అధ్యక్షుడు పి.వీరన్నదొర ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ జి.చక్రవర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి టి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు జేవీ లీల, సంయుక్త కార్యదర్శి కృష్ణవేణి, కార్యదర్శి తాడుతూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దారి చూపిన యువకులు

సంతకవిటి: గరికపాడు గ్రామంలో గత ఐదేళ్లుగా రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో స్థానికులు వి.చక్రపాణి, మరికొంత మంది యువకులు కలిసి సొంత నిధులతో రోడ్డును బాగుచేయించారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డును బాగు చేయించిన దృశ్యం

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

సంతకవిటి: తాలాడ గ్రామంలో గౌతు లచ్చన్న జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ ముగ్గు సరస్వతి, రామారావు దంపతుల ఆధ్వర్యంలో గౌతు లచ్చన్నకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.